# అవసరం

ఒక కాన్ఫరెన్సుకి హాజరవడం కోసం అనుకోకుండా ఢిల్లీ వెళ్లాల్సి వచ్చింది. టిక్కెట్టయితే ఏదోవిధంగా రిజర్వు చేసుకున్నాను. ఇంక వెళ్ళడమే తరువాయి.

మాది ఊరు పొలిమేరలని పరామర్శిస్తున్న కొత్త కాలని. అక్కడినుండి నాంపల్లి స్టేషన్ ఐదుమైళ్ళ పైన ఉంటుంది. వెళ్ళేది దూరప్రయాణం - అందులోనూ చలికాలం అందువల్ల, ఎంత తక్కువ సామాను తీసుకు వెళ్దామన్నా ఒక పెట్టె, బెడ్డింగ్ తప్పలేదు. వీటితో రెండు బస్సులు మారి రైలుస్టేషనుకి వెళ్ళడమంటే తల ప్రాణం తోకకి వచ్చినంత పని అవుతుంది. అందుకనే బాగా ముందుగా బయలుదేరి ఆటోమీదనో టాక్సీ మీదనో వెళ్ళాలనుకున్నా.

పెట్టె, బెడ్డింగులను బస్‌స్టాప్ వరకు చేర్చడమెల్లా అనేదే పెద్ద సమస్య అయింది. ఎందుకంటే మా కాలనీలో రిక్షాలు కూడా దొరకవు. ఎంతసేపు చూసినా ఒక్క రిక్షా రాకపోయేసరికి ఏం చేయాలో తోచక కంగారు పుట్టింది. అస్థిమిత మనస్సుతో ఇంట్లోంచి బయటికీ, బయటనుండి ఇంట్లోకి తిరుగుతున్నాను. మా పొరుగింటి సుబ్బారావు అప్పుడే ఆఫీసునుంచి వచ్చి సైకిలు దిగుతూ కనిపించాడు. అతనూ మా ఆఫీసులోనే పనిచేస్తాడు. అతన్ని చూడగానే నాకో ఆలోచన వచ్చింది. అవసరానికి మొహమాటం అడ్డురాదు. కనుక వెంటనే అతన్ని పిలిచి, "సుబ్బారావు, నువ్వేమీ అనుకోపోతే నాకో సహాయం చేయాలి. ఇందాకట్నించి చూస్తున్నా, ఒక్క రిక్షా కూడా రావడంలేదు. నేను అర్జంటుగా ఊరు పోవాలి. కాస్త నువ్వు సైకిలు తెచ్చావంటే, నా పెట్టె, బెడ్డింగ్, క్యారియర్ మీద పెట్టి వెనకాల నేను నడుస్తాను. నువ్వు సైకిల్ నడిపిద్దుగాని. నన్ను సెంటర్‌లో వదిలేసి నువ్వు వచ్చేయి. నేను ఏ ఆటోనో టాక్సీనో చేయించుకు వెళ్తాను" అన్నాను ప్రాధేయపూర్వకంగా. "అల్లాగే, ఇంత మాత్రాని కేనా" అంటూ వెంటనే, సైకిలు తీసుకువచ్చాడు సుబ్బారావు. నా మనస్సులో దిగులు కొంత తీరింది.

ముందు సుబ్బారావు నడిపిస్తూంటే, వెనకాల సామాను నేను పట్టుకుని, అరమైలు దూరం నడుచుకుంటూ వెళ్లాం. సుబ్బారావుకి థాంక్సు చెప్పి పంపించేశాను. టైము చూసుకుంటే 6-30 అయింది. ఇంకా గంటన్నర టైముంది. ఏ ఆటో దొరికినా, టాక్సీ దొరికినా, అరగంటలో వెళ్లిపోవచ్చు. ఇంక కంగారు పడనవసరం లేదు.

నాకర్మ కొద్దీ ఆ రోజు శనివారం. ఊళ్ళో గుర్రపు పందాలు జరుగుతున్నాయి. వాటిని చూడడానికి వచ్చిన జనమే ఊళ్లోని ఆటోలనీ, టాక్సీలనీ కంట్రాక్టు పుచ్చేసుకున్నట్లుంది. అసలు ఆ సెంటర్ మీదుగా వచ్చే వాహనాలే తక్కువ. ఆ వచ్చే కాసినీ కూడా జనంతో నిండి వెళ్తున్నాయి. చూస్తుండగానే అరగంట గడిచింది. నాకు ఏ వాహనమూ దొరకలేదు. మధ్య మధ్య ఏదో ఓ రిక్షావాడు ఆగి 'కాజానా సాబ్' అని అడగడమూ, నేను 'అవసరం లేదు' అని సమాధానం చెప్తుండడమూ జరిగింది.

రిక్షాలో వెళ్లే ప్రయాణం కాదాయె నాది.

ఇఁకో పావుగంట గడిచింది. అదేం కరమ్మమో, శాపం పెట్టినట్లు, ఆటో ఒక్కటి కూడా దొరకలేదు. రైలు ఎక్కి ప్రయాణం చేయవలసిన నాకు గుండెల్లో రైళ్ళు పరిగెత్తడం మొదలెట్టాయి. వాహనం దొరుకుతుందన్న ఆశ అడుగంటి పోయింది. పోనీ ఇందాకనే, ఏ రిక్షానో చేయించుకు వెళ్లి ఉంటే, ఎల్లాగొల్లాగ లంఖణాల బోటు లాగానైనా నేను వెళ్లి ఉండేవాడినే. ఇప్పుడు ఆ రిక్షాలు కూడా కనిపించడం మానేశాయి. నా బుర్ర అంతకంతకీ వేడెక్కిపోతోంది.

మరో ఐదు నిముషాలు గడిచాయి. కొంచెం దూరంలో నా వైపే ఒక ఖాళీ రిక్షా వస్తూ కనిపించింది. దానిని చూడగానే నా ప్రాణం లేచొచ్చింది. ఎడారిలో మంచినీరు దొరికినంత సంబరం అయింది. వాడు ఎంత అడిగినా సరే, దానిలో ఎక్కి, ఎక్కడ ఖాళీ ఆటోకాని, టాక్సీ కాని కనిపిస్తే, అక్కడినుంచి దానిలో పోవాలని నా ఉద్దేశం. ఆ రిక్షావాడు నా దగ్గరికి వచ్చేటప్పటికి ఐదు నిముషాలు కూడా పట్టలేదు. కాని నాకు ఐదు యుగాలు గడిచినట్లనిపించింది.

ఆ రిక్షావాడు, వాడంతట వాడే నా దగ్గర రిక్షా ఆపి, "ఎక్కడికి పోవాలి దొరా?" అని అడిగాడు.

అయితే రిక్షాని చూసినప్పుడు నాకు కలిగిన ఉత్సాహం వాడిని చూడగానే నీరుకారిపోయింది. వాడిని మనిషి అనడం కంటె ఎముకల పోగు అనడం బాగుంటుంది. అస్థిపంజరానికి చిరిగిపోయిన చొక్కా, లాగూ వేసినట్లుగా ఉన్నాడు వాడు. 'ఈ ఉసూరుమియ్యా నన్నేం తీసికెళ్తాడురా బాబు' అనుకుని ఉస్సురనుకున్నా.

"ఎక్కడికి పోవాలి సార్?" అని మళ్లీ అడిగాడు వాడు.

"నేను నాంపల్లి స్టేషన్‌కి పోవాలి, నీవల్ల కాదులే, పో" అన్నాను కొంచెం విసుగ్గా.

"కాదు దొరా తీసుకెళ్తాను," అన్నాడు వాడు.

"ఏమిటీ నువ్వా, ఈ అప్స్ డౌన్స్ దాటుకుంటూ నువ్వేం వెళ్తావు! దారిలోనే నీ ప్రాణం పోతుంది, వద్దులే" అన్నాను. రిక్షా తొక్కుతూ వచ్చినందుకు వాడు నానా ఆయాస పడుతున్నాడు. ఆయాసంతో మాటలు అతి నీరసంగా, అస్పష్టంగా వస్తున్నాయి.

"అల్లా అనకు దొరా. జరంవొచ్చి నాలుగు రోజుల నించి బండి తోలటం లేదు. ఇంట్లో పెళ్లాం పిల్లలు మలమల మాడుతున్నారు. ఈయాల ఇంతవరకు గిరాకి దొరకలేదు. వట్టి చేతులతో ఇంటికెళ్లే - అంతా పస్తే దొరా" అన్నాడు వాడు. ఆ మాటలు అంటుంటే వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వాడి మాటలు వింటుంటే నాకు వాడిమీద జాలి వేసింది, అసహ్యం వేసింది. ఇంతోటి వీడికి పెళ్లామూ, పిల్లలూనూ. మనిషి ఇప్పుడో రేపో అన్నేట్టు ఉన్నాడు. వీడికి సంసారం ఎందుకో! మన కుటుంబ నియంత్రణ పథకాలు, నిజంగా అవసరమైన పేద ప్రజలలోకి వెళ్లలేదనిపించింది వాడిని చూస్తే.

"ఏం దొరా" అన్న వాడి పిలుపుతో నా ఆలోచనలకి అంతరాయం కలిగింది.

"వద్దులే" నీవల్లకాదు, అని ఆటోకోసం లేదా మంచి రిక్షాకోసం ఆత్రుతగా అటూ ఇటూ చూడసాగాను. వాడు ఉస్సురుమంటూ రోడ్డు ప్రక్కనే రిక్షా ఆపుకుని అందులో కూర్చున్నాడు.

మరో పది నిముషాలు గడిచాయి. నా గుండెల్లో రైళ్ళు బదులు సూపర్ ఎక్స్‌ప్రెస్‌లు పరుగిడ సాగాయి. కనుచూపు మేరలో ఎలాంటి వాహనమూ లేదు. ఇంక లాభం లేదనుకొని ఆ రిక్షా వాడినే పిలిచాను.

వాడు ఆశగా దగ్గరకి వచ్చాడు.

"నాంపల్లికి వెళ్ళడానికి ఎంతసేపు పట్టుంది నీకు?" అన్నాను. "అరగంటలో తీసుక వెళ్తాను. మహా అయితే నలభై నిమిషాలు" అన్నాడు వాడు.

"నాకున్నదే నలభై నిమిషాలు. రైలు ఎనిమిదింటికి" అన్నాను. "నీకెందుకూ, నీ బండి అందిస్తానుగా, బేగి కూర్చో దొరా" అన్నాడు, సామాను తీసుకోడానికి వస్తూ.

"ఏమిమ్మంటావు?" అని అన్నాను.

"నీ ఇష్టం. కష్టం నీకు తెలీదా దొరా?" అన్నాడు వాడు.

"ఈ మాటలు చెప్పకులేరా! అక్కడికి వెళ్ళాక పేచీ పెట్టడం మీకు మామూలే" అన్నాను నేను.

"అల్లాంటోణ్ణి కానుదొరా. రెండున్న ఇచ్చేయి" అన్నాడు.

"ఎందుకూ రెండున్నర - రెండు రూపాయలు ఇస్తా" అన్నా. నిజానికి అక్కడికి రెండున్నర, మూడు రూపాయలకి తక్కువ ఎవరూ రారు. కాని బేరం చేయడం అలవాటు అవడం ఒకటి, బేరం అడగని వాడిని చవటగా లోకం జమకట్టడం రెండు, ఆ పైన వాడి అవసరాన్ని ఉపయోగించుకొని తక్కువ ఇయ్యాలనే లోభం - వీటి మూలంగా అల్లా అడిగాను. నిజానికి అల్లా అడిగినందుకు మనస్సులో ఎంతో సిగ్గుపడ్డాను. అందుకే వాడి ముఖం వంక సూటిగా చూడలేక పోయాను.

"అన్నీ తెలిసిన మారాజులు. నేసెప్పేది ఏముంది. నీకు ఎంత న్యాయమని తోస్తే అంతే ఇయ్యి దొరా. అవసరం నాది. పైసలు తీసుకెళ్ళందే పస్తే" అన్నాడు వాడు వచ్చి బెడ్డింగ్ తీసుకొంటూ.

"అవసరం నాది కూడాలే" అని మనస్సులో అనుకొని పెట్టిని నేను రిక్షాలో పెట్టాను.

వాడు ఆయాసపడ్తూ బెడ్డింగ్‌ని ఎత్తి రిక్షా వెనుక పెట్టాడు.

నేను రిక్షాలో కూర్చున్నాను. రిక్షా కదిలింది. కాని అది నడుస్తున్నట్లే నాకు అనిపించడం లేదు. "వీడి మొహం వీడేమి అందిస్తాడు బండికి? కిరాయి కోసం డప్పాలు కొట్టాడు కాని" అని అనుకొంటూ, నిమిష నిమిషానికీ వాచీ చూసుకుంటూ, రోడ్డు మీద ఏ ఖాళీ వాహనమైనా కనిపిస్తుందేమోనని వేయి కళ్ళతో వెదకసాగాను.

కాలం గడుస్తున్నా ఖాళీ వాహనం మాత్రం కంటబడలేదు. నేను రిక్షా వాడిని తొందరపెట్టసాగాను.

తొక్కలేక తొక్కలేక, వాడు రిక్షా తొక్కుతూ పడుతున్న బాధ వర్ణనాతీతం. అది చూసి నేనూ చాలా బాధ పడ్తున్నాను. కాని ఏం చేయను? నా అవసరం నాది. తప్పని సరిగా వాడిని తొందర పెట్తున్నాను.

ఇంక ఎనిమిదికి ఏడు నిమిషాలే ఉంది. వెళ్ళవలసిన దూరం రెండు ఫర్లాంగులలోకి వచ్చింది. ఇంతదూరం వాడు ఎల్లా తొక్కుకొచ్చాడా అని ఆశ్చర్యమేసింది. తన పెళ్ళాం బిడ్డల్ని పోషించుకోవాలన్న సంకల్పంతో తప్ప, అది సాధ్యం కాదనిపించింది. వాడి మనోశక్తికి ఆశ్చర్యపోయాను. నా అవసరం మళ్ళీ నన్ను హెచ్చరించింది. ఇంత శ్రమపడ్డా ఈ ఐదు నిమిషాలలో స్టేషన్‌కి చేరగలననే నమ్మకం నాకు పోతోంది.

"తొక్కు. ఇంకా త్వరగా తొక్కు. టైం అయిపోతోంది" అంటూ తొందర పెట్టాను. చేతికో ముల్లుకర్ర ఉంటే ఎద్దుని పొడిచినట్లు పొడిచే వాడినేమో!

"నిన్ను టైముకి చేరుస్తాను దొరా" అంటూ బలంగా పెడల్సుని తొక్కడం మొదలెట్టాడు. వాడి బాధ చూడలేక సైకిల్ రిక్షా చైను కిర్రు కిర్రు మనసాగింది. వాడి ముక్కు వెంట వస్తోంది

ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కావు; సెగలున్న పొగలు.

ఎల్లా చేర్చాడో వాడికే తెలియాలి. సరిగ్గా ఒక నిమిషం ఉందనగా స్టేషన్‌కి రిక్షాని చేర్చి, కాంపౌండులో చెట్టు దగ్గర ఆపాడు. "వెళ్లు దొరా. టైమైంది" అంటూ క్రిందికి దిగాడు. నన్ను వెళ్ళన్నాడే కాని వాడి కూలి సంగతి అడగలేదు.

ఆ సమయంలో వాడిని చూస్తుంటే, నాకెంతో అభిమానం, సంతోషం కలిగాయి. కంగారుగా జేబులోనించి డబ్బుతీసి, అన్నదానికంటే ఎక్కువగా ఓ రూపాయి తీసి వాడి చేతిలో పెట్టాను.

వాడు నిలబడలేకపోతున్నాడు. నేను డబ్బు చేతిలో పెట్టానో లేదా కుప్పకూలినట్లు కూలిపోయి, విపరీతంగా ఆయాసపడసాగాడు.

వెంటనే ప్రక్కనే ఉన్న రిక్షా వాళ్లూ కూలీ వాళ్లూ అక్కడికి పరుగెత్తుకు వచ్చారు.

నేను నివ్వెరపోయి చూస్తుండిపోయాను.

వాడు అతి ప్రయత్నం మీద "వెళ్లు దొరా, టైమైంది" అన్నాడు. అంతే మరి మాట్లాడలేదు.

రైలు కదలపోతూ కూత కూసింది. నేను కంగారుగా సామాను కూలీ నెత్తినపెట్టి పరుగు అందుకున్నాను.

రెండడుగులు వెళ్లానో లేదో, వెనకాల నుంచి, "అరే, రాములు మర్‌గయా భాయ్" అన్నమాటలు వినిపించాయి.

మనస్సు వెనక్కి లాగుతుంటే, అవసరం ముందుకి తోస్తుంటే పరుగుపరుగున వెళ్ళి కదులుతున్న రైలెక్కాను.

పాపం ..... రాములు! నా అవసరం గడిపాడు. కాని వాడి అవసరం గడవలేదు.

వేగంగా పరుగిడుతున్న రైలులో, అంతకన్న వేగంగా, రాములు గురించీ, వాడి సంసారం గురించీ, నా ఆలోచనలు పరుగిడసాగాయి.

*(యోజన, 1-28 ఫిబ్రవరి 1978)*